ఆది వారం
26-11-2023
సంపుటి - 08,
సంచిక - 398
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# దొరల తెలంగాణకు ప్రజల తెలంగాణకు మధ్య పోరు

- తెలంగాణ ఇస్తే కెసిఆర్ కుటుంబమే బాగుపడింది
- బిజెపి, బిఆర్ఎస్‌లు రెండూ ఒక్కటే
- ప్రజా తెలంగాణ ఆకాంక్ష కాంగ్రెస్ లక్ష్యం
- ప్రభుత్వం రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం
- ఆదిలాబాద్ ప్రచార సభలో రాహుల్ వెల్లడి



**ఆదిలాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** బిఆర్ఎస్, బిజెపిలు ఒక్కటేనని, అధికారం కోసం ఈ రెండు పార్టీలు కలసి పనిచేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఒక్క కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. ప్రజా తెలంగాణ రావాలనే తన ఆకాంక్షన్నారు. దొరల తెలంగాణలో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారంటూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యమ కారులకు 200 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామన్నారు. ఆరు గ్యారంటీలను మొదటి కేబినెట్ సమావేశంలోనే అమలు చేశారు. తెలంగాణలో కేసీఆర్, ఢిల్లీలో నరేంద్ర మోదీ ఒక్కటేనన్నారు. నరేంద్ర మోదీకి కేసీఆర్, ఎంఐఎం పార్టీ ఇద్దరూ స్నేహితులేనన్నారు. ప్రజా తెలంగాణ రావాలనేదే తన ఆకాంక్ష అని ఆదిలాబాద్? సభలో రాహుల్ గాంధీ అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల కలలను నాశనం చేశారన్నారు. తొమ్మిదేళ్లలో తెలంగాణలో అవినీతి జరిగిందన్నారు. ప్రజా

3వ పేజీలో...

# రాజకీయ నిరుద్యోగి రాహుల్‌గాంధీ

బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



- యువతను రెచ్చగొట్టి, చిచ్చుపెట్టాలని చూస్తున్నారు
- 2,2,735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం
- 1,60,083 నియామకాలు పూర్తిచేశాం
- 95 శాతం ఉద్యోగాలు స్థానిక బిడ్డలకే దక్కేలా జోనల్ వ్యవస్థ
- రాహుల్‌గాంధీపై మంత్రి కేటీఆర్ విమర్శలు
- త్వరలో హైస్పీడ్?తో పరుగులు తీసే ర్యాపిడ్ రైల్
- హైదరాబాద్? నుంచి ఎక్కడికైనా గంటలో వెళ్లొచ్చు!
- రాబోయే పదేళ్లలో రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు

3వ పేజీలో...

# ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత మాది

కామారెడ్డి సభలో ప్రధాని మోడీ పిలుపు



- 370 ఆర్టికల్ మొదలు అన్ని హామీలు నెరవేర్చాం
- పసుపుబోర్డు, గిరిజన వర్సిటీ ఇచ్చాం
- మీ అండదండలతోనే ఇవన్నీ చేయగలిగాం
- బిఆర్ఎస్ అవినీతిని తరిమి కొట్టాలి

**కామారెడ్డి, నవంబర్ 25 (సమ సమాజం):** ఇచ్చిన హామీలను అమలు చేసిచూపిన సత్తా బిజెపిదని ప్రధాని మోడీ అన్నారు. తెలంగాణలోనూ బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించారు. కామారెడ్డి సభలో మాట్లాడుతూ కెసిఆర్ అవినీతిని అంతమొందించేందుకు ఇక్కడా ఓడించాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ అవినీతికి చరమగీతం పాడాలన్నారు. వాగ్దానం ఇచ్చామంటే అమలు చేసి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామని చెప్పారు. కామారెడ్డి నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి ప్రజలకు మంచి అవకాశం దక్కిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య వంటి విషయాల్లో చిత్తశుద్ధిని చాటుకున్నామని అన్నారు. గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టామన్నారు. నిజామబాద్‌కు పసుపుబోర్డు ఇచ్చామని గుర్తు చేశారు. మాదిగల సమస్యలు ప్రస్తావిస్తూ వారికి కూడా పరిష్కారం చూపుతామని అన్నారు. ఇకపోతే టీఆర్ఎస్ హఠాత్తుగా బీఆర్ఎస్‌గా మారిందని, యూపీఏ కాస్త ఇండియా కూటమిగా మారిపోయిందని విమర్శించారు. ఇక్కడ జన ప్రవాహం కనిపిస్తోందని, దీన్ని బట్టి ప్రజలు కెసిఆర్‌పై ఎంతగా వ్యతిరేకతతో ఉన్నారో అర్థం చచేసుకోవ చ్చన్నారు. తొమ్మిదేళ్ల వారి

2వ పేజీలో...

# తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది

రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఒకలక్ష నలభైవేల అప్పు



- తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చారు
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదే
- ఆమనగల్ బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే

**ఆమనగల్, నవంబర్ 25 (సమ సమాజం):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై ఒక లక్ష నలభై వేల అప్పు చేశాడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇవ్వడం జరిగిందని.. కాంగ్రెస్ పార్టీ ఇందిరా గాంధీ పేదరికాన్ని నిర్మూలించాలని భూ పంపిణీ చేయడం

2వ పేజీలో...

# మతపర రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం

అధికారంలోకి రాగానే 4శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తాం

- తెలంగాణ అభివృద్ధికి బిజెపి కట్టుబడి వుంది
- ఎస్సీ వర్గీకరణను సాధించి చూపుతాం
- అవినీతి కెసిఆర్‌ను ఇంటికి పంపించడం ఖాయం
- మీడియా సమావేశంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. బిజెపి అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తామని ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణపై వరాల జల్లు కురిపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే 4శాతం ముస్లిం రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ,

2వ పేజీలో...

# 6 గ్యారెంటీలు తప్పనిసరిగా అమలుచేస్తాం

- ప్రజల బాధలను కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదు
- ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ ఆలోచన
- మధిర కాంగ్రెస్? బహిరంగ సభలో ప్రియాంక గాంధీ



మధిర,నవంబర్25(ఆర్ఎన్ఎ): ప్రజల బాధలను కేసీఆర్? సర్కార్? పట్టించుకోలేదని.. తెలంగాణ సంపదను పంచుకోవడంలోనే ఆ పార్టీ నేతలు నిమగ్నమయ్యారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే దేశంలో ప్రజలే నాయకులని.. ప్రజల కంటే తాము అతీతులం అన్నట్లు మోదీ, కేసీఆర్ భావిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని సోనియా గాంధీ తనతో చెప్పారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ

2వ పేజీలో...

# బీసీలు సీఎం కావాలి

- బీసీలకు రాజ్యాధికారం ఇస్తున్నందుకే బీజేపీకి మద్దతు
- రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి
- కేంద్రంలో బీజేపీ సర్కార్ రావాలి
- నాకు తెలంగాణ పునర్జన్మనిచ్చింది



**తాండూర్, నవంబర్ 25 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లా తాండూర్ లో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి నేమురు శంకర్ గౌడ్ తరపున ప్రచారం నిర్వహించారు. అనంతరం ఇంద్రచౌక్ లోని రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన బీజేపీకి మద్దతు ఇవ్వడానికి ముఖ్య కారణం బీసీలకు రాజ్యాధికారం ఇస్తున్నందున అని అన్నారు. బీసీలు సీఎం

# ఓటమి భయంతోనే గజ్వేల్ నుంచి పరార్

- ప్రజల నుంచి ఛీత్కారం తప్పదనే కామారెడ్డికి మకాం
- కెసిఆర్‌ను ఓడిస్తేనే తెలంగాణకు ముక్తి
- గజ్వేల్ ప్రచారంలో ఈటెల రాజేందర్ విమర్శలు



**సిద్దిపేట, నవంబర్ 25 (సమ సమాజం):** హుజూరాబాద్‌కు నువ్వు రాకపోతే నీ దగ్గరకే నేనోస్త అని గజ్వేల్‌కు వచ్చిన.. నేను వచ్చాక నువ్వు కామారెడ్డి పారిపోయావు' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఈటెల

2వ పేజీలో...

# కరాచీలోని షాపింగ్ మాల్‌లో ఘోర అగ్నిప్రమాదం

11 మంది మృతి, ఆరుగురికి గాయాలు



**కరాచీ, నవంబర్ 25 (సమ సమాజం):** పాకిస్థాన్ కరాచీలోని ఓ షాపింగ్ మాల్?లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 11 మంది మరణించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 42 మందిని రక్షించారు. ఓ షాపింగ్ మాల్?లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 11 మంది

2వ పేజీలో...

# ప్రజాదర్బార్ ఏమైంది..?

- 5 లక్ష కోట్ల అప్పుల రాష్ట్రంగా మారింది
- రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ వైపు చూస్తుంది
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్
- ఇద్దరు ఎంపీలతో తెలంగాణ రాలేదు
- సకలజనులు పోరాటం చేస్తేనే రాష్ట్రం వచ్చింది
- జేఏసీ ఆధ్వర్యంలో కొట్లాడినం..
- సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు: చాడ వెంకట్‌రెడ్డి
- మీడియా సమావేశంలో కాంగెస్, సీపీఐ, జనసమితి నేతలు



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):**రాష్ట్రం మొత్తం మావైపే చూస్తుందన్నారు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. శనివారం ప్రగతి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కాంగెస్, సీపీఐ,

2వ పేజీలో...

# ప్రజాదర్బార్ ఏమైంది..?



(మొదటి పేజి తరువాయి) జనసమితి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, సీపీఐ, జనసమితి పార్టీలు కలిసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం. మా కలయికతో బీఆర్ఎస్‌ను ఓడిస్తున్నాం. ప్రచార కో ఆర్డినేషన్ కమిటీ వేసుకొని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నాం. ప్రజల నుండి మంచి స్పందన వస్తుంది' అని తెలిపారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. 'ఏ లక్ష్యం మేరకు తెలంగాణ సాధించుకున్నామో అది నెరవేరడం లేదు. ఇద్దరు ఎంపీలతో తెలంగాణ రాలేదు. సకలజనులు పోరాటం చేస్తేనే రాష్ట్రం వచ్చింది. జేఏసీ ఆధ్వర్యంలో కొట్లాడినం.. సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారు. మోడీ రాష్ట్రా ఏర్పాటుపై విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనే సాగుతుంది. కేసీఆర్ మంత్రి వర్గంలో ఉద్యమకారులున్నారా. కాళేశ్వరం అద్భుతం అన్నారు ఏమైంది? కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు కులాయా? పేపర్ లీకేజ్ లతో ఉద్యోగాల భర్తీ కాలేదు. నిరుద్యోగులు కేసీఆర్‌పై కోపంగా ఉన్నారు. నియంత పరిపాలన సాగుతోంది. ప్రజాదర్బార్ ఏమైంది.. 5 లక్ష కోట్ల అప్పుల రాష్ట్రంగా మారింది. ఉపాధి అవకాశాలు లేవు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు అన్నాడు.. అన్ని బంద్ అయ్యాయి. బీజేపీ కూడా బీఆర్ఎస్ కోసం పనిచేస్తుంది. కొత్తగూడెంలో సీపీఐని, మిగతా ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతున్నాం' అని చాడ వ్యాఖ్యానించారు.

# ఓటమి భయంతోనే గజ్వేల్ నుంచి పరార్



(మొదటి పేజి తరువాయి) రాజేందర్ వ్యాఖ్యలు చేశారు. ఓటమి భయంతో గజ్వేల్ వదిలి కామారెడ్డిలో పోటీకి దిగారని అన్నారు. ఇక్కడి ప్రజలకు ఏనాడూ అందుబాటులో లేకపోవడంతో ఓడిస్తారన్న భయం పట్టుకుందని, అందుకే కామారెడ్డిలో పోటీకి దిగారని అన్నారు. జిల్లాలోని ములుగు మండలంలోని కొత్తూరుతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో గజ్వేల్ బీజేపీ పార్టీ అభ్యర్థి ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోడీ సభకు ప్రజలు రాకుండా ఉండేందుకు కేసీఆర్ దావత్లు చేస్తున్నారన్నారు. ఈటెల పేదోళ్ల వైపు, ధర్మం వైపు ఉంటాడని... ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ అన్యాయానికి వ్యతిరేకంగా పిడికిలి ఎత్తుతాడని స్పష్టం చేశారు. బీజేపీకి అధికారం ఇస్తే కేసీఆర్ కాదు.. కేసీఆర్ జేజెమ్మతో కొట్లడుతా అని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 30 వేల మంది కేసీఆర్ బాధితులు ఉన్నారన్నారు. కేసీఆర్‌కు ప్రజల మీద నమ్మకం లేక బ్రోకర్లకు డబ్బులు ఇచ్చి ప్రజలకు దావతులు, డబ్బులు ఇచ్చి మోసం చేయాలని చూస్తున్నారని ఈటెల రాజేందర్ విరుచుకుపడ్డారు. ఈ ఎన్నికల్లో కెసిఆర్‌ను ఓడిస్తేనే తెలంగాణ బాగుపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం, దేశ ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు ఎకరానికి 24 వేల రూపాయలు సాయం చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ చేస్తున్న సాయం పది వేలు మాత్రమేనన్నారు. రైతు పక్షపాతి ఎవరో గుర్తుంచుకుని ఓటు వేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వేస్తే వరికి కనీస మద్దతు ధర 3,100 రూపాయలు చేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులది భూ కబ్జాల చరిత్ర అన్నారు. ఎన్నికలైపోగానే ఇద్దరూ ఒక్కటై కేసులు సెటిల్ చేసుకుంటారన్నారు. పేదల పక్షాలన పోరాటం చేస్తే తనపై కుట్ర పూరితంగా కేసులు పెట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్లు ఇస్తామని డబ్బులు తీసుకుని మోసం చేశారన్నారు. నేను ఆస్తులు సంపాదించినట్లు రుజువు చేస్తే అవన్నీ ప్రజలకు పంచేందుకు సిద్ధమన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఎకరానికి ఆరు వేలు బ్యాంకులో జమ చేస్తుందన్నారు. చేనేత బంధు ఇచ్చి ఆదుకుంటామని చెప్పి మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు భూకబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే భూకబ్జాల సంగతి తేల్చుతానన్నారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్‌కు కుడి భుజంలా ఉంటూ 2004 నుంచి 2018 వరకు టీఆర్ఎస్ తరపున అప్రతిహతంగా గెలుస్తూ వచ్చిన ఈటల రాజేందర్.. ప్రస్తుతం గజ్వేల్ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్‌పైనే బరిలోకి దిగారు. టీఆర్ఎస్‌లో తిరుగులేని నేతగా ఎదుగుతూ వచ్చిన ఈటల రాజేందర్‌ను పొమ్మనలేక పొగపెట్టి పంపించగా.. ఆయన బీజేపీలో చేరి 2022 ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీకి చుక్కలు చూపించి, విజయం సాధించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో నేరుగా సీఎం కేసీఆర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా మారారు.

# కరాచీలోని షాపింగ్ మాల్‌లో ఘోర అగ్నిప్రమాదం



(మొదటి పేజి తరువాయి) మృతిచెందారు. ఆరుగురు గాయపడ్డారు. పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో శనివారం జరిగిందీ ఘటన. మంటలను అదుపు చేసేందుకు వచ్చిన సిబ్బంది 42 మందిని రక్షించారు. మరికొందరు మంటల్లో చిక్కుకున్నట్టు సమాచారం. శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో షాపింగ్ మాల్ రెండో అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాసేపటికే మాల్?లోని నాలుగు, ఐదు అంతస్తులకు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు పన్నెండు అగ్నిమాపక యంత్రాలతో 50 మంది సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతి కష్టం మీద మంటలు ఆర్పారు. లోపల చిక్కుకున్న 42 మందిని రక్షించారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. "మంటలను అదుపు చేసేందుకు మాల్?కు విద్యుత్ సరఫరా నిలిపివేశాం. ఊపిరాడక మంటల్లో చిక్కుకుని 11మంది మృతిచెందారు. భవనంలో ఉన్న వారి కోసం ఇంకా మా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. అయితే ఇంకా కారణాలు తెలియలేదు. దర్యాప్తు చేస్తున్నాం. గత వారమే కొంత మంది అధికారులు కరాచీలోని పలు భవనాలను పరిశీలించారు. వీటిలో 90 శాతం మేర భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని చెప్పారు. "మృతదేహాలను రెండు ఆసుపత్రులకు తరలించాం. తొమ్మిది మృతదేహాలను జిన్నా ఆసుపత్రికి.. మరో రెండింటిని సివిల్ ఆసుపత్రికి తరలించాం. సిబ్బంది రక్షించిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది." అని కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం.. ఉత్తర ఇరాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు వాయవ్యంగా 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్‌రోడ్ నగరంలోని ఓ ప్రైవేటు మాదకద్రవ్యాల బాధితుల పునరావాస కేంద్రంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 32 మంది మృతి చెందగా.. మరో 17 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. క్షతగాత్రులను నగరంలోని వివిధ ఆసుపత్రులకు తరలించామని అధికారులు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది



(మొదటి పేజి తరువాయి) జరిగిందని తెలిపారు. మరోవైపు.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఆయన చెప్పారు. భారతదేశంలో నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు నిత్యావసర ధరలు పెంచి ప్రజలకు మోసం చేస్తున్నారని ఖర్గే మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు చదువు కోసం 5లక్షలు, గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకు ఇస్తామన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం లాగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఖర్గే అన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు అనేక హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తా అన్నాడు, ప్రతి ఒక్కరి అకౌంటులలో 15లక్షల రూపాయల వేస్తానని అన్నారు.. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రజలలో ఉండకుండా ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా.. కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు.

# బీసీలు సీఎం కావాలి



(మొదటి పేజి తరువాయి) కావాలని తెలిపారు. బీసీల నాయకత్వం ఉన్న తెలంగాణ రావాలని పవన్ కోరారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ఆయన తెలిపారు. మరోవైపు.. అన్యాయం జరిగుతే తిరగబడతామని పవన్ కల్యాణ్ అన్నారు. 2004 నుంచి నేమూరీ శంకర్ గౌడ్ మీ ఎమ్మెల్యే అభ్యర్థి నాతో పోరాటంలో పాల్గొన్నారని అక్కడి ప్రజలనుద్దేశించి తెలిపారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ రావాలని కోరారు. నాకు జన్మనిచ్చింది ఆంధ్రా అయినా.. పునర్జన్మనిచ్చింది తెలంగాణ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రుణపడి ఉంటానని పవన్ తెలిపారు. ఇదిలా ఉంటే.. ఇటీవలే మరణించిన గద్దర్ అన్న మరణం తనను చాలా బాధించిందని చెప్పారు. ఇదిలా ఉంటే.. శ్రీశైలంలో యురేనియం తవ్వకాలపై ఉద్యమం చేసామని అప్పటి రోజులను పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. ఇదిలా ఉంటే.. పవన్ కల్యాణ్ నాగర్ కర్నూలు ప్రయాణం రద్దు చేసుకున్నారు. తాండూర్ సభ వేదిక నుంచి పవన్ కల్యాణ్ ప్రకటన చేశారు. నాగర్ కర్నూల్ అభ్యర్థి లక్ష్మణ్ గౌడ్ గెలిపించాలని పిలుపునిచ్చారు. తాండూర్ ప్రజలకు సమస్య వస్తే.. ఆ సమస్యపై రోడ్డుపైకి వచ్చి పోరాటం చేద్దామని పవన్ కల్యాణ్ అన్నారు.

# మతపర రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం



(మొదటి పేజి తరువాయి) ఓబీసీలకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. బీజేపీకి అవకాశమిస్తే వరి పంటకు వెయ్యి రూపాయల బోనస్ ఇస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపించాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. మిగులు రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా అమిత్ షా మార్చారు. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరటం ఖాయమని అమిత్ షా అన్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గిస్తూ.. మొదట కేబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. కేసీఆర్ హయాంలో యువత సహా.. అన్ని వర్గాలు నిరాశలో ఉన్నాయని అమిత్ షా పేర్కొన్నారు. పాస్‌పోర్ట్, మియాపూర్ భూములు, ఔటర్ రింగ్ రోడ్, గ్రానైట్, మనీ లాండరింగ్.. కేసీఆర్ సర్కార్ అవినీతి మయమయ్యాయన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు పథకాలు వస్తున్నాయని అమిత్‌షా తెలిపారు. లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని కేసీఆర్ మాట తప్పారన్నారు. రూ.3,116 నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని అమిత్ షా ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేయడంలో కేసీఆర్ సర్కార్ విఫలమైందన్నారు. ఫార్మా సిటీ, విద్యా సిటీ, టెక్స్ టైల్స్ పార్క్.. ఎక్కడని ప్రశ్నించారు. కాంగ్రెస్ వలనే తెలంగాణ రాష్ట్రం ఆలస్యమవుతోందన్నారు. కాంగ్రెస్, ఎంఐఎంకు ఓటు వేస్తే.. బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనని అమిత్ షా పేర్కొన్నారు. తెలంగాణ భూముల వేలంలో రూ. 4వేల కోట్లు అవినీతి జరిగిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆయన శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓఆర్ఆర్ లీజు వేలంలోనూ, కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా కుంభకోణం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని అమిత్ షా పేర్కొన్నారు. లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు.. అదీ జరగలేదన్నారు. ఉద్యోగ పరీక్షల పేపర్లు చేసి కుంభకోణానికి పాల్పడ్డారని మండిపడ్డారు. రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేస్తామని పూర్తి చేయలేదని తెలిపారు. రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మరిచిపోయారు. హైదరాబాద్ లో 4 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం ఏమైందని ప్రశ్నించారు.ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని షా తెలిపారు. రెండు దశాబ్దాలుగా మాదిగ సామాజికవర్గానికి అన్యాయం జరుగుతోందని అమిత్ షా పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయటం కోసం కేంద్ర కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇంట్లో కూర్చుని ప్రభుత్వాన్ని నడిపేవారికి పరిపాలన ఏం తెలుసని ప్రశ్నించారు. ఫాంహౌస్‌లో కాదు .. ముఖ్యమంత్రి సచివాలయంలో ఉండాలన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే విచారణ జరిపి అవినీతి పరులను జైలుకు పంపుతామని అమిత్ షా పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక.. ప్రస్తుత పథకాలను కొనసాగిస్తామన్నారు. ఎంఐఎం వలనే కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించటం లేదన్నారు. కేంద్ర నిధులపై తెలంగాణ సీఎం కేసీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. దక్షిణాదిలో అన్ని రాష్ట్రాలపై బీజేపీ ఫోకస్ చేసిందని అమిత్ షా పేర్కొన్నారు.

# కేసీఆర్‌లాంటి అహంకార సీఎం చరిత్రలో లేరు

## వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** కేసీఆర్ అంతటి అహంకార ముఖ్యమంత్రి చరిత్రలో ఎవ్వరూ లేరని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆమె ట్విటర్ వేదికగా కేటీఆర్, కేసీఆర్‌లపై ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేస్తూ.. 'సీఎంను ప్రజలు కలవాల్సిన అవసరం ఏముందంటున్న కేటీఆర్ గారు.. అసలు మీకు జనం ఓటు వేయాల్సిన అవసరం ఏముంది? ఓట్లేసి గెలిపిస్తే ప్రజలకు సేవ చేయడానికా లేక గడీల్లో భోగాలు అనుభవించడానికా? నాడు మహానేత వైయస్ఆర్ గారు రచ్చ బండలో ప్రజల ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కరించి ప్రజా ప్రభుత్వానికి చిరునామాగా నిలిస్తే.. క్యాంప్ ఆఫీస్‌లోనే ప్రజా దర్బార్ పెట్టి ప్రతి సమస్యను వింటే.. నేడు కేసీఆర్ చేస్తున్నది నియంత పాలన. ఓట్లేసిన పాపానికి జనాలకు కష్టాలు..దొరకు ఫామ్ హౌజ్ వైభోగాలు.అధికార మత్తులో మీకు ప్రజా సమస్యలు కనిపిస్తలే.. ఇండ్లు లేక పేదలు రోడ్డెక్కి ధర్నాలు చేస్తే మీకు కళ్లు కనపడతలే. ధరణి సమస్యలపై రైతుల గోడు వినిపించదు.. ఉద్యోగాలు కావాలని మొత్తుకుంటున్న నిరుద్యోగుల ఆకలి కేకలు మీ చెవిన పట్టవు.. సర్కారు బడిలో సౌలతులు లేక పేద బిడ్డలు పడుతున్న బాధలు మీకు కానరావు.. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని సమస్యల సుడిగుండంలో ముంచారు. మీ పాలనలో ప్రజలకు మిగిలింది కష్టాలు, కన్నీళ్లే.. ముమ్మాటికి మీరు తెలంగాణ ద్రోహులే' అని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

# 6 గ్యారెంటీలు తప్పనిసరిగా అమలుచేస్తాం




(మొదటి పేజి తరువాయి) పేర్కొన్నారు. బలమైన ప్రభుత్వం వచ్చి ఉంటే.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరేవన్నారు. రాష్ట్ర సంపదను ప్రజలకు పంచే ప్రభుత్వం వస్తుందని ప్రజలు ఆశపడ్డారని.. కానీ అలా జరగలేదని విమర్శించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు తప్పనిసరిగా అమలు చేసే బాధ్యత తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించిన కాంగ్రెస్? బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పేదలు ఇళ్లు కట్టుకునేందుకు డబ్బులు ఇస్తామని చెప్పిన బీఆర్?ఎస్? ప్రభుత్వం.. ఆ హామీని నెరవేర్చలేదని ప్రియాంక గాంధీ విమర్శించారు. ప్రజల బాధలను కేసీఆర్? సర్కార్? పట్టించుకోలేదన్నారు. తెలంగాణ సంపదను పంచుకోవడంలోనే ఆ పార్టీ నేతలు నిమగ్నమయ్యారని దుయ్యబట్టారు. దేశంలో ప్రజలే నాయకులని.. ప్రజల కంటే అతీతులు అన్నట్లు మోదీ, కేసీఆర్ భావిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రైతులకు రుణమాఫీ చేస్తామన్న కేసీఆర్ హామీ నెరవేరలేదని.. రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసర ధరల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అన్ని పెద్ద ప్రాజెక్టుల్లో అవినీతి..: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆలోచిస్తోందని ప్రియాంక పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని.. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన విద్యార్థుల భవిష్యత్ ఏంటని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాలు లేవన్న ఆమె.. ప్రత్యేక రాష్ట్రం వల్ల కేసీఆర్ కుటుంబసభ్యులు మాత్రమే బాగుపడ్డారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని.. కమీషన్ల పేరుతో ప్రాజెక్టుల్లో భారీ అవినీతి చేశారని ఆరోపించారు. బీఆర్?ఎస్? నేతలకు వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆ పార్టీ నేతలు కృషి చేయరని మండిపడ్డారు. నిన్న రాత్రి సోనియాగాంధీతో మాట్లాడాను. ఎక్కడున్నావు అని నన్ను సోనియా అడిగారు. హైదరాబాద్‌లో ఉన్నా.. రేపు మధిర వెళ్తాను అని చెప్పాను. తెలంగాణ కోసం ప్రజలు ఎంతగా పోరాడారో నాకు తెలుసు అని సోనియా చెప్పారు. ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని అన్నారు. బలమైన ప్రభుత్వం వచ్చి ఉంటే.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరేవి. తెలంగాణ సంపదను ప్రజలకు పంచే ప్రభుత్వం వస్తుందని ప్రజలు ఆశపడ్డారు. కానీ అలా జరగలేదు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలు తప్పనిసరిగా అమలు చేసే బాధ్యత తీసుకుంటాఅని అన్నారు.

# అల్లూరి జిల్లా ఏవోబీలో ఘోర రోడ్డు ప్రమాదం

## సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటనలో ఐదుగురు మృతి

**అల్లూరి జిల్లా, నవంబర్ 25 (సమ సమాజం):** అల్లూరి జిల్లా ఏవోబీలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఏవోబీ కటాఫ్ ఏరియాలోని హంతల్‌గూడ ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మరో 10 మందికి తీవ్రగాయాలు అయినట్లు తెలుస్తోంది.

# స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

**విజయవాడ, నవంబర్ 25 (సమ సమాజం):** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ఓ స్కూల్ బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. శనివారం బలుసుపాడు రోడ్డు నుంచి పట్టణంలోకి వస్తున్న స్కూల్ బస్సులో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. బస్సులోని బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో పొగలు కమ్మేశాయి. ఈ సమయంలో బస్సులో దాదాపు 40 నుంచి 50 మంది విద్యార్థులు ఉన్నారు. పొగలను గమనించిన డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. వెంటనే అక్కడకు చేరుకున్న స్థానికులు ముందుగా స్పందించి బ్యాటరీ వైర్లను తెంచేశారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకుంది. ఈ ఘటనతో విద్యార్థులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. అయితే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.


# పివిని ఘోరంగా అవమానించిన కాంగ్రెస్

**టిక్కెట్ ఇవ్వకుండా అవమానించారు**

**భౌతిక కాయాన్ని కార్యాలయంలోకి రానివ్వలేదు**

**పివికి రాహుల్, ప్రియాంకలు క్షమాపణలు చెప్పాలి**

**మంత్రి కెటిఆర్ డిమాండ్**



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** పీవీ.నరసింహారావు పేరెత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. కేటీఆర్ జాతీయ మీడియాతో మాట్లాడుతూ..పీవీ లాంటి గొప్ప నాయకుడిని ఘోరంగా అవమానించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు.. ప్రధానిగా పనిచేసిన నాయకుడికే పార్టీ టికెట్ కూడా ఇవ్వకుండా అవమానించలేదా.. అన్నారు. పీవీ పార్థీవదేహాన్ని ఏఐసీసీ కార్యాలయానికి రానివ్వకుండా అవమానించిన సంగతిని తెలంగాణ ప్రజలు మర్చిపోరన్నారు. దేశ నాయకుడికి ఢిల్లీలో మెమోరియల్ కూడా నిర్మించ కుండా అడ్డుకున్నది కాంగ్రెస్సేనని అన్నారు. పీవీ కుటుంబానికి కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పీవీ నరసింహారావు శతజయంతి ఘనంగా జరిపింది.. గొప్పగా గౌరవించుకుంది. భారతరత్న ఇవ్వాలని కోరింది.. తీర్మానాలు చేసిందని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ఉద్యమం చేశారా? ఉద్యోగం చేశారా..?, ఎన్నడూ ఉద్యమం చేయని రాహూల్ గాంధీ యువత గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. రాహుల్ ఒక రాజకీయ నిరుద్యోగి. ఆయన ఉద్యోగం కోసం నిరుద్యోగుల్ని రెచ్చగొట్టి చిచ్చుపెట్టాలని చూస్తున్నారు. డొల్లమాటలు.. కల్లబొల్లి కబుర్లు తప్ప చిత్తశుద్ధి లేదు. కర్ణాటకలో 100 రోజుల్లో రెండున్నర లక్షల ఉద్యోగాల మాటిచ్చి.. ఆర్నెళ్లు గడుస్తున్నా ఒక్క నోటిఫికేషన్ దిక్కులేదు. తొమ్మిదన్నర ఏళ్లలో 1,60,083 ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత మాది. దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇంత కంటే ఎక్కువ ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ చాలా అన్యాయం చేసిందని, ఆయనను తీవ్రంగా అవమానించిందని, ఈ చరిత్ర గురించి కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీకి ఏ మాత్రం అవగాహన లేకపోవడం నిజంగా దురదృష్టకరమని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆయన మనందరం అభిమానించే వ్యక్తి అని, భూమి పుత్రుడని, తన జీవితం అంతా కాంగ్రెస్ పార్టీ కోసం సేవ చేసిన అలాంటి మానవతామూర్తిని కాంగ్రెస్ పార్టీ దారుణంగా అవమానించిందని మంత్రి చెప్పారు. 1996లో సిట్టింగ్ ప్రధానిగా ఉన్న పీవీ నర్సింహారావుకు ఎంపీ టికెట్ నిరాకరించి.. కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని మంత్రి తెలిపారు. పీవీ మరణించినప్పుడు కనీసం 24 అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలోకి కూడా ఆయన భౌతిక కాయాన్ని అనుమతించకుండా అవమానించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఈ చరిత్ర గురించి ప్రియాంకాగాంధీకి అవగాహన లేకపోవడం దారుణమని అన్నారు. పీవీ కుటుంబానికి రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# దొరల తెలంగాణకు ప్రజల తెలంగాణకు మధ్య పోరు



(మొదటి పేజి తరువాయి) తెలంగాణలో మహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ ప్రతి మహిళ ఖాతాలో రూ. 2,500 జమచేసి వంట గ్యాస్? ను రూ, 500 లకే అందిస్తామన్నారు. రూ. 4 వేలు వృద్దులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇస్తామన్నారు. రాజీవ్? ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని అందజేస్తామన్నారు. తెలంగాణలో ఇక బిఆర్ఎస్ అవినీతి పాలన అంతం కాబోతున్నదని, బిజెపి, బిఆర్ఎస్ రెండూ తెలంగాణ ద్రోహ పార్టీలని అన్నారు. బోధన్‌లో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం,నరేంద్ర మోడీ నల్లచట్టాలు చేసి రైతులను మోసం చేస్తున్నారన్నారు. నా పార్లమెంటు సభ్యత్వం రద్దు చేశారు.. నాకు ప్రభుత్వ ఇంటిని తొలగించారని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కేసీఆర్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారని.. అక్కడ మోడీ.. ఇక్కడ కేసీఆర్ ఒకటే అని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ కారు పంచర్ అయ్యిందన్నారు. రాష్ట్రంలో దొరల పాలన కొనసాగుతోందని తెలిపారు. కాళేశ్వరం పేరుతో పెద్ద కుంభకోణం చేశారని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌తో ఎమ్మెల్యేకు భూములు అప్పగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. దొరలకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. పేదల కోసం కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. మళ్ళీ అధకారంలోకి వేస్తే భూములు గుంజుకుంటారని విమర్శించారు. కేసీఆర్ చదువుకున్న పాఠశాల కాంగ్రెస్ పార్టీ కట్టిందే అని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని ఐటీ సిటీ చేసింది కాంగ్రెస్ అని.. మెట్రో కాంగ్రెస్ హయంలోనే వచ్చిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు దోపిడీదారులన్నారు. లిక్కర్ మాఫియా, భూదందా కేసీఆర్ కుటుంబంలో ఉందని దుయ్యబట్టారు. దళితబంధు, ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్ దారి మళ్లించారని ఆరోపించారు. వచ్చేది ప్రజల ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మొదటి క్యాబినెట్ మీటింగ్‌లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ఏ బిల్లు పెట్టినా కేసీఆర్ మద్దతు ఇచ్చారన్నారు. మూడు బిల్లులను తాను కళ్లారా చూసినట్లు తెలిపారు. తెలంగణ తన సొంత ఇల్లు అని పేర్కొన్నారు. కేసీఆర్ మీద ఒక్క కేసు పెట్టలేదని.. కేసీఆర్‌కు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. కేసీఆర్, బీజేపీని తరిమికొట్టాలని.. కేంద్రంలో బీజేపీని, మోడీని ఓడించాలని పిలుపు నిచ్చారు. కేసీఆర్ తెలంగాణలో, మోడీ ఢిల్లీలో రాజ్యమేలుతున్నారని అన్నారు. కారు టైరులు కాంగ్రెస్ పంచర్ చేసిందని.. బీఆర్ఎస్ గాలి తీశారని.. ఢిల్లీకి వెళ్లి మోడీని పంచరు చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల తెలంగాణ తెచ్చుకుందామని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

# సిఎం కెసిఆర్ రెగ్గొట్టే వ్యాఖ్యలు

## సంయమనం పాటించాలని ఇసి నోటీసులు




**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 30న బాన్సువాడ ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదును పరిశీలించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ భారత ఎన్నికల సంఘానికి రిపోర్ట్ చేశారు. కేసీఆర్ వ్యాఖ్యలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయంటూ ఈసీఐ అడ్వైజరీ కమిటీకి లేఖ రాశారు. కేసీఆర్‌కు లేఖ పంపాలని అడ్వైజరీ కమిటీ నిర్ణయించింది. దీంతో ఈసీఐ ఆదేశాల మేరకు శుక్రవారం అర్ధరాత్రి కేసీఆర్‌కు సీఈవో వికాస్ రాజ్ లేఖను పంపించారు. కాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి ఘటనపై స్పందిస్తూ కేసీఆర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ సీఈసీకి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# గుండెపోటుతో డిస్పీ మృతి



**తిరుపతి, నవంబర్ 25 (సమ సమాజం):** జిల్లాలో శనివారం విషాదం జరిగింది. తిరుమల శ్రీవారి నడక మార్గంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ కృపాకర్ (59) గుండెపోటుతో మృతి చెందారు. 1,805 మెట్టు మార్గం వద్ద కుప్పకూలిన ఆయన్ను గమనించి ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. కృపాకర్, ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి భద్రతా విధుల నిమిత్తం తిరుమలకు వచ్చారు. ఈ క్రమంలో విధుల్లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆయన స్వస్థలం విజయవాడ సమీపంలోని పోరంకి. కాగా, దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# కరెంట్ కావాలా... కాంగ్రెస్ కావాలా...

ఉచిత విద్యుత్‌తో పాటు, నిరంతర విద్యుత్ సరఫరా ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా మారింది. కాంగ్రెస్ వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటోందని, పది హెచ్‌పి మోటర్లు పెట్టాలంటోందన్న వాదనను కెసిఆర్ సహా మంత్రులు, బిఆర్ఎస్ శ్రేణులు గట్టిగా తెరపైకి తెచ్చారు. కరెంట్ కావాలా..కాంగ్రెస్ కావాలా అన్న నినాదాం ఇప్పుడు మార్మోగుతోంది. దీంతో కరెంట్ విషయంలో వివరణ ఇచ్చుకునే క్రమంలో కాంగ్రెస్ కొంత ఇబ్బంది పడుతోంది. 9 గంటల ఉచిత విద్యుత్ బ్రాండ్ తమదేనని చెబుతున్నారు. వైఎస్ హయాంలో ఉమ్మడి ఎపిలో ఉచిత వ్యవసాయ విద్యుత్ అమల్లోకి వచ్చింది. ఆయన ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ అందిస్తూ వచ్చారు. తెలంగాణ ఏర్పాటు, కెసిఆర్ సిఎం అయ్యాక నిరంతర విద్యుత్ సాకారమయ్యింది. అలాగే వ్యవసాయానికి కూడా నిరంతర విద్యుత్ అమల్లోకి వచ్చింది. ఇక్కడే విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయానికి 24గంటల నిరంతర విద్యుత్ రావడం లేదన్న విషయాన్ని ప్రస్తావించడం ద్వారా కాంగ్రెస్ చర్చకు తెరలేపింది. ఎక్కడైనా వెళ్లి నిరంతర విద్యుత్‌ను పరిశీలిద్దామని పిసిసి చీఫ్ రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందునుంచే సవాళ్లు విసురుతూ వచ్చారు. చాలా కమతాలు 2,3 ఎకరాలు ఉన్నాయని, వాటికి మూడుగంటలపాటు విద్యుత్ సరఫరా జరిగితే సరిపోతుందని ఓ చర్చలో రేవంత్ చెప్పారు. దీనిని గుర్తించకుండా ఉచిత విద్యుత్, నిరంతర విద్యుత్ పేరుతో అక్రమంగా అడ్డగోలు ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి, అక్రమాలకు తెరలేపారని రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు. అయితే ఇప్పుడు ఇదంతా పక్కకు పోయి 3 గంటలు కరెంట్ చాలంటున్నారని, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే 3 గంటల కరెంట్ మాత్రమే ఇస్తారని బిఆర్ఎస్ ప్రచారాన్ని ఉధృతం చేసింది. ఎన్నికల్లో తప్పుదోవ పట్టించడం, ఎదుటి పక్షాలను ఆత్మరోణలోకి నెట్టడం షరామామూలే. ఇప్పుడు బిఆర్ఎస్ అదే చేస్తోంది. అయితే నిరంతర విద్యుత్ ఇవ్వడం తెలంగాణలో కీలక పరిమాణంగానే చూడాలి. ఇప్పుడు గృహ, పరిశ్రమలకు కోతలు లేకుండా విద్యుత్ అందుతోంది. దీంతో పారిశ్రామిక ప్రగతి సూచీ కూడా పరుగులు పెట్టింది. గత ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇస్తామని వాగ్దానం చేసినా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కాలేదు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ శాఖ రైతులకు రాత్రిపూట విద్యుత్ సరఫరా చేసేది. దీంతో పలువురు రైతులు రాత్రిపూట పంపుసెట్లు ఆన్ చేసేందుకు పొలాల్లోకి వెళ్తుండగా విద్యుదాఘాతం లేదా పాముకాటుకు గురై మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఈ ఘటనల ఆధారంగానే ఉచితంగా అందిస్తున్న 9 గంటల కరెంట్‌ను నిరంతర సరఫరాకు కెసిఆర్ నిర్ణయించి అమలు చేశారు. నిరంతర విద్యుత్ అన్నది ప్రకటించినా..నిరంతరాయంగా రావడం లేదన్నది కాంగ్రెస్ వాదనగా ఉంది. గతంలో పవర్ హాలిడేలతో పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. పారిశ్రామికవేత్తలు ధర్నాకు దిగాల్సిన దయనీయ పరిస్థితిని చూశాం. తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకార అవుతుందని, తీగెల మీద బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని సమైక్య పాలకులు ఎద్దేవా చేశారు. కానీ, వారి అంచనాలను తలక్రిందులు చేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించింది. నేడు అన్ని రంగాలకు నిరంతరాయంగా 24 గంటల పాటు, వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచింది. ఇలాంటి సాహసం పక్కనే ఉన్న ఎపి కూడా చేయలేకపోతోంది. అందుకే విద్యుత్ విధానంలో ఇప్పుడు దేశానికే ఆదర్శం తెలంగాణ అని చెప్పకతప్పదు. గుజరాత్‌లో కూడా ఇలా నిరంతర విద్యుత ఇవ్వడం లేదు. అంతెందుకు ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి సాహసం జరగడం లేదు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి దాదాపు మూడున్నరేండ్ల కాలంలో పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా సిఎం కెసిఆర్ తీసుకున్న చర్యల కారణంగా వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్తు పంపిణీ ప్రారంభమైంది. దీంతో విద్యుత్ కోతలకు ఆస్కారం లేకుండా పోయింది. అడపాదడపా అంతరాయాలు ఉన్నా..నిరంతర విద్యుత్ విషయంలో విజయం సాధించామనే చెప్పుకోవాలి. అలాగే దేశంలో వ్యవసాయ వినియోగదారులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గతంలో ఉమ్మడి ఎపిలో వ్యవసాయ రంగానికి పగలు 3 గంటలు, రాత్రి 3 గంటలు విద్యుత్తు సరఫరా అయ్యేది. ఆ తరవాత ఏకంగా 9గంటల విద్యుత్ ఇచ్చారు. తరవాత రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించి అమలు చేస్తున్నారు. ఈ ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుంది. 26.96 లక్షల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అనడంలో ఎలాంటి సందేహం లేదు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థలు బలోపేతం చేయడం కూడా గమనించ వచ్చు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసారు. కొత్త విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సాగుతోంది. యాదాద్రి పవర్ ప్లాంటుతో మరింత విద్యుత్ అందనుంది. 800 మెగావాట్ల సామర్థ్యంతో కొత్తగూడెం పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. సింగరేణి కాలరీస్ నిర్మించిన 1200 మెగావాట్ల సామర్థ్యంతో మంచిర్యాల లోని జైపూర్ పవర్ ప్లాంట్ కూడా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. విద్యుత్తును అదనంగా అందుబాటు లోకి తెచ్చింది. జూరాల, పులిచింతల నుంచి 360 మెగావాట్ల హైడల్ పవర్ సమకూర్చింది. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ స్టేషన్ లో ఉత్పత్తి ప్రారంభమైంది. 4000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో టీఎస్ జెన్కో దామరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ఎ÷-లాంటు నిర్మాణం తుదిదశకు చేరుకున్నది.

# రాజకీయ నిరుద్యోగి రాహుల్‌గాంధీ

**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** యువతను రెచ్చగొట్టి, వారి మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్న రాజకీయ నిరుద్యోగి రాహుల్‌గాంధీ అంటూ మంత్రి కేటీఆర్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో రాహుల్‌గాంధీకి కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించి.. సవాల్ విసిరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నలు సంధించి.. సవాల్ విసిరారు. యువతను రెచ్చగొట్టి.. చిచ్చుబెట్టాలని చూస్తున్న రాజకీయ నిరుద్యోగి రాహుల్‌గాంధీ అని వ్యాఖ్యానించారు. దేశంలో గత పదేళ్లల్లో తెలంగాణ కంటే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందా అని సూటిగా ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేళ్లలో 2,2,735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 1,60,083 నియామకాలు పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వమని.. ఈ లెక్క తప్పని నిరూపించగలవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం వెలగబెట్టిన పదేండ్ల కాలంలో (2004-14) తెలంగాణలో భర్తీ చేసిన ఉద్యోగాలు ఎన్ని? కేవలం 10,116 మాత్రమే కాదా? ఇదేనా నిరుద్యోగులపై ప్రేమ అంటూ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. మా ప్రభుత్వం ఏడాదికి సగటున నింపిన కొలువులు 16,850.. అదే కర్ణాటకలో 100 రోజుల్లో 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. 6 నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెపుతావా.. వాగ్దానం చేసి యువతను వంచించలేదా.. మీరు రాజ్యం ఏలుతున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఉద్యోగాల భర్తీ హామీ మరిచి నిరుద్యోగులను ముంచింది నిజం కాదా అంటూ ఎదురుదాడి చేశారు. అదే కాంగ్రెస్ హయాంలో ఏటా ఇచ్చింది కేవలం 1012 జాబులు! ఇదీ మీకూ మాకూ ఉన్న తేడా మీరొచ్చి మాకు సుద్దులు చెబితే ఎట్లా అంటూ కేటీఆర్ విమర్శించారు. జీవితంలో ఎప్పుడైనా ఉద్యమం చేశావా? ఉద్యోగం చేశావా? యువత ఆశలు ఆకాంక్షలు తెలుసా? పోటీ పరీక్షలు రాసినవా? ఇంటర్వ్యూకు వెళ్లావా? ఉద్యోగార్థుల ఇబ్బందులు ఏమన్నా అర్థమైతయా రాహుల్ గాంధీ అని ధ్వజమెత్తారు. 95 శాతం ఉద్యోగాలు స్థానిక బిడ్డలకే దక్కేలా కొత్త జోనల్ వ్యవస్థ తీసుకొచ్చిన నిబద్ధత మాది.. మా కొలువులు మాకే దక్కాలన్న ఉద్యమస్ఫూర్తి నిలబెట్టి నియామకాల నినాదం నిజం చేసిన వాస్తవాన్ని కాదనగలవా రాహుల్ అని అన్నారు. 1972లో సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనలు సమర్థిస్తూ తీర్పునిస్తే పార్లమెంట్‌లో చట్టంచేసి రద్దు చేసి తెలంగాణ స్థానికత హక్కులకు సమాధి కట్టింది మీ పార్టీ కాదా అంటూ కేటీఆర్ ఆరోపించారు. 6 సూత్రాలు.. 610 జీవోలు.. గిర్ గ్లానీ నివేదకలు తుంగలో తొక్కి హైదరాబాద్ ఫ్రీ జోన్‌గా మార్చేసి స్థానికేతర కోటాలు పెట్టి తెలంగాణ యువతకు దక్కాల్సిన కొలువులు కొల్లగొట్టి తీరని అన్యాయం చేసిన ద్రోహులు మీరు కాదానని మండిపడ్డారు. మీ పనికి మాలిన పాలనలో ఉపాధి, ఉద్యోగాల్లేవని నిరాశ నిస్పృహలతో యువత తుపాకులు చేతబట్టి అడవిబాట పట్టి నక్సలైట్లలో చేరింది నిజమా.. కాదా అంటూ ప్రశ్నించారు. వేల మంది యువకుల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చి చంపి ఎన్‌కౌంటర్ల పేరిట నిత్యం నెత్తుటేర్లు పారించిన కర్కశమైన పాలన మీది కాదా అంటూ అన్నారు. 2004లో తెలంగాణకు ఇచ్చిన మాటతప్పి పదేండ్లు కాలయాపన చేసి వందల మంది యువత ఆత్మబలిదానాలకు కారణమైన నేరం మీదికాదా అంటూ ప్రశ్నించారు. సోనియాను బలిదేవతని మీ పీసీసీ ప్రెసిడెంటే చెప్పింది అబద్ధమా అంటూ ఎద్దేవా చేశారు. మీరు ప్రకటించిన పసలేని జాబ్ క్యాలెండర్ ఒక పచ్చి మోసం కాదా? ఎన్నికల కోడ్ అమల్లో ఉండే 2024 మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఉద్యోగ నోటిఫిషన్లు ఎట్లా సాధ్యం.. యువతను మభ్యపెట్టి నాలుగు ఓట్లు వేయించుకునే నాటకం తప్ప చిత్తశుద్ధి ఏమైనా కనిపిస్తుందా అంటూ భగ్గుమన్నారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే దమ్ముందా... రాహుల్ గాంధీ.. అంటూ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో దూరప్రాంతాలకు వేగవంతమైన ప్రజా రవాణా సదుపాయాల కల్పనపై బీఆర్ఎస్ తమ ప్రణాళికలు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా గంట వ్యవధిలో చేరుకునేలా ర్యాపిడ్ రైల్ ట్రాన్సిల్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఐటీ రంగాన్ని.. చిన్న పట్టణాలకు విస్తరించేందుకు ఇది దోహదం చేస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తెలిపారు. శుక్రవారం ఆయన 2047 హైదరాబాద్ విజన్ ప్రజెంటేషన్?లో ఈ కారిడార్ల గురించి చెప్పారు. నగరంలో ఓఆర్ఆర్ వరకు మెట్రో.. అక్కడి నుంచి ర్యాపిడ్ రైల్ తీసుకొస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజా రవాణా సదుపాయాలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. 2047 విజన్?తో ప్రజా రవాణాకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే ప్రజలకు ఆకర్షించే విధంగామెట్రోలో మార్పులు తీసుకువచ్చారు. తెలంగాణలోని చాలా జిల్లాల ప్రజలు హైదరాబాద్?లో ఉపాధి పొందుతున్నారు. ప్రజా రవాణా విస్తరణ వల్ల వారికి చాలా ఉపయోగం చేకూరుతుంది. ప్రజా రవాణాకు సంబంధించి మొదలు హైదరాబాద్ నుంచి విజయవాడ (దాదాపు 250 కిలో మీటర్లు) గంటన్నరలో చేరుకునేలా ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా ప్రభుత్వం చేపట్టనుంది. దీనివల్ల రెండు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు గొప్ప మలుపు అవుతుందని పేర్కొంది. రోజుకు విజయవాడ - హైదరాబాద్ మధ్య వందలాది మంది ప్రయాణిస్తుంటారు. కాగా మొదటి అయిదేళ్లలో 250 కిలో మీటర్లు.. రాబోయే పదేళ్లలో 415 కిలో మీటర్ల మెట్రో విస్తరణ చేసే యోచనలో ప్రభుత్వం ఉంది.



1. శామీర్?పేట (ఓఆర్ఆర్) - గజ్వేల్ - కొమరవెల్లి - సిద్దిపేట - కరీంనగర్ - 140 కిలో మీటర్లు.
2. ఘట్?కేసర్ (ఓఆర్ఆర్) - బీబీనగర్ నుంచి యాదాద్రి, జనగాం, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్?పూర్ - వరంగల్ 113 కిలో మీటర్లు.
3. పెద్ద అంబర్‌పేట(ఓఆర్ఆర్)
   ఎ) చౌటుప్పల్ నుంచి చిట్యాల్- నార్కట్‌పల్లి, నల్గొండ 81 కిలో మీటర్లు.
   బి) నార్కట్‌పల్లి, నరిరేకల్- సూర్యాపేట, కూసుమంచి, ఖమ్మం 111 కిలో మీటర్లు.
4. శంషాబాద్ (ఓఆర్ఆర్)- షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ 50 కిలో మీటర్లు.
5. అప్పా (ఓఆర్ఆర్)- మొయినాబాద్, చేవెళ్ల, మన్నెగూడ, వికారాబాద్ 60 కిలో మీటర్లు.
6. ముత్తంగి(ఓఆర్ఆర్)- ఇస్నాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ 64 కిలో మీటర్లు.
7. కండ్లకోయ (ఓఆర్ఆర్)
   ఎ) మేడ్చల్-మనోహరాబాద్, మాసాయిపేట, చేగుంట, మెదక్ 70 కిలో మీటర్లు.
   బి) చేగుంట-రామాయంపేట, బిక్నూర్, కామారెడ్డి, డిచ్‌పల్లి, నిజామాబాద్ 103 కిలో మీటర్లు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి

## అయోధ్యలో రామాలయం బిజెపి ఘనతే ■ కాగజ్‌నగర్ సభలో యూపి సిఎం యోగి

**కాగజ్ నగర్, నవంబర్ 25 (సమ సమాజం):** డబుల్ ఇంజన్ సర్కార్ తోనే తెలంగాణలో అభివృద్ధి జరుగుతుందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్య నాథ్ అన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కాంగ్రెస్ పార్టీతోనో, బీఆర్ఎస్ పార్టీతోనో అయ్యేదా అని ఆయన ప్రశ్నించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని గ్రౌండ్ లో శనివారం ఏర్పాటు చేసిన రామరాజ్య స్థాపన సంకల్ప సభలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాగజ్ నగర్ కు వచ్చిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు సిర్పూర్ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్ బాబు, పార్టీ శ్రేణులు శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఆపై ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న యోగి ఆదిత్య నాథ్ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు నా కోటి కోటి వందనాలు అని స్పీచ్ మొదలుపెట్టిన యూపీ సీఎం యోగి... అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై ప్రస్తావించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో అయ్యేదా అని ప్రశ్నించారు. రామాలయం కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. సిర్పూర్ లో బీఆర్ఎస్, బీఎస్పీ కలిసి పోటీ చేస్తున్నాయని, సొంత రాష్టాల్లో్ చెల్లని బీఎస్పీ పార్టీ తెలంగాణలో చెల్లుతుందా అని ఎద్దేవా చేశారు. తెలంగాణ వచ్చాక కేసీఅర్ అరాచక, ఆన్యాయ పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ పాలన ముస్లింలకు అనుకూలంగా సాగుతుందని, తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తేనే కొన్ని మతాల ఆరాచకం తగ్గుతుందన్నారు. బీఆర్ఎస్ అంటేనే బ్రష్టా చార్ రిస్వత్ కొర సమితి అని అన్నారు. యూపీలో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చాక కర్ఫ్యూ, ధర్నాలు లేవన్నారు. తెలంగాణలో పరీక్షలు సరిగ్గా నిర్వహించలేని సీఎం కేసీఆర్, పాలన సమర్థవంతంగా ఎలా చేస్తాడని యూపీ సీఎం యోగి ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కామన్ దోస్తు ఎంఐఎం పార్టీ అని వీరంతా కలిసి ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, ప్రతి ఇంటికి పథకాలు అందుతున్నాయని చెప్పారు. తెలంగాణలోను బీజేపీ అధికారంలోకి వస్తేనే, తెలంగాణ బంగారు తెలంగాణ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# వికారాబాద్‌లో దళితబంధు ఆశలు

## సిఎం ప్రచారంతో పెరిగిన భరోసా

## ఎమ్మెల్యే తీరుపై పార్టీని వీడిన గులాబీ నేతలు

## చంద్రశేఖర్ పార్టీ రడంతో పట్టు కోల్పోయిన బిజేపీ

**వికారాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** దళితబందుపై వికారాబాద్ వేదికగా సిఎం కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆశలు రేపుతున్నాయి. అధికారంలోకి రాగానే ఇక్కడ ఒకేదఫాలో దళితబంధు అమలు చేస్తామని అన్నారు. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం కావడంతో కెసిఆర్ ఓటర్లను ఆకట్టుకునేందుకు పాచిక వేశారు. మ్మడి రంగారెడ్డి జిల్లాలో14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇది ఒకటి. తెలంగాణ వచ్చాక 2016లో వికారాబాద్ కేంద్రంగా కొత్త జిల్లా ఆవిర్భవించింది. ఇందులో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. వికారాబాద్ సెగ్మెంట్ పరిధిలో వికారాబాద్, మోమిన్‌పేట, ధారూరు, బంట్వారం, మర్పల్లి, కోట్‌పల్లి మండలాలు ఉన్నాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్?లో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ అభ్యర్థి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కాంగ్రెస్ నుంచి గడ్డం ప్రసాద్ కుమార్, బీజేపీ నుంచి నవీన్ కుమార్ పోటీలో నిలిచారు. అయితే, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ నెలకొంది. ప్రస్తుత అభ్యర్థి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ లీడర్లను పెద్దగా పట్టించుకోవడం లేదని ఇటీవల చాలా మంది నేతలు బీఆర్ఎస్‌ను వీడారు. అనంతగిరిని తెలంగాణ ఊటీ చేస్తామని సీఎం కేసీఆర్‌తో పాటు అందరు నేతలు ప్రకటించారు. నేటికీ హామీని నెరవేర్చలేదు. అధికార పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఉన్న అసంతృప్తులను బుజ్జగించేందుకు మెతుకు ఆనంద్‌ను గెలిపించే బాధ్యతను అధిష్ఠానం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డికి అప్పగించింది. దీంతో రంగంలోకి దిగిన ఆయన పార్టీలో అందరినీ సమన్వయం చేసుకుంటూ..అసమ్మతి నేతల ఇండ్లకు వెళ్లి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేసేలా ఒప్పిస్తున్నారు. కాగా.. ఆనంద్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా అంతటా పర్యటించాల్సి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో సెగ్మెంట్‌ను దాటడం లేదు. మరోవైపు మంత్రి మహేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్ మధ్య ఎప్పటి నుంచో వర్గపోరు నడుస్తుంది. ప్రస్తుతం ఇద్దరూ ఒక్కటైనప్పటికీ మహేందర్ రెడ్డి వర్గం ఎంతవరకు సహకరిస్తుందనేది చెప్పలేం. ప్రభుత్వ పథకాలు, సీఎం కేసీఆర్ పైనే బీఆర్ఎస్ గెలుపు నమ్మకం పెట్టుకోగా.. ఎన్నికల ఫలితాల తర్వాతే తెలుస్తుంది. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్‌కు 2014,2018లో రెండుసార్లు ఓడిన సెంటిమెంట్ తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు వ్యతిరేక వర్గం నేతలు హస్తం గూటికి చేరడం కలిసొస్తుందనే చర్చ జరుగుతుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లు కూడా కాంగ్రెస్‌కు పడతాయని పార్టీ అభ్యర్థితో పాటు క్యాడర్ ధీమాగా ఉంది. మాజీమంత్రి చంద్రశేఖర్ వర్గం పూర్తిగా సపోర్టు చేస్తుండటం కూడా ఆయనకు కలిసి వస్తుందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తుంది. పార్టీ అధికారంలోకి వస్తే వికారాబాద్ జిల్లా కొడంగల్ నుంచి పోటీ చేస్తున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సీఎం అవుతారని, అప్పుడు జిల్లా మరింత డెవలప్ అవుతుందని జోరుగా ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి ఈ ఎన్నికల్లో గెలుపుపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. ఇక్కడ బీజేపీకి బలమైన నేత మాజీ మంత్రి ఎ. చంద్రశేఖర్ ఉండగా.. ఎన్నికల నోటిఫికేషన్?కు ముందు ఆయన కాంగ్రెస్?లో చేరారు. ప్రస్తుతం జహీరాబాద్ నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో ఆయనతో పాటు క్యాడర్ కూడా వెళ్లిపోయింది. ఇప్పుడు బీజేపీకి పెద్దగా పట్టు అయితే లేదు. 2018లో కాంగ్రెస్? ఓటమికి ఆయనే ప్రధాన కారణమని చెప్పొచ్చు. అప్పట్లో కాంగ్రెస్?టికెట్ ఆశించగా రాకపోవడంతో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేసి 23వేల ఓట్లు సాధించాడు. కాంగ్రెస్? 3,092 ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. హైదరాబాద్ రాష్ట్రంలో 1952లో వికారాబాద్ ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. జనరల్, ఎస్సీ రిజర్వేషన్లు ఉండేవి. జనరల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా దివంగత మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి, ఎస్సీ అభ్యర్థి అరిగె రామస్వామి ఇద్దరూ గెలిచారు.

# రెండుచోట్లా మహిళా ఓట్లే కీలకం

## వారే గెలిపిస్తారన్న నమ్మకంలో బిఆర్ఎస్

## పోటాపోటీగా మహిళా అభ్యర్థులు ప్రచారం

**మెదక్, నవంబర్ 25 (సమ సమాజం):** మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించడంలో వారి ఓట్లు కీలకం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు మహిళల ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. మ్యానిఫెస్టోలో మహిళలకోసం ఇచ్చిన హామీలపై విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే బిఆర్ఎస్ మహిళా అభ్యర్థి సునీతారెడ్డికి టిక్కెట్ కేటాయించింది. మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇద్దరు మహిళలే కావడం కలసి వస్తోంది. మెదక్ అభ్యర్థి పద్మా దేవేందర్?రెడ్డి, నర్సాపూర్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి పలకరిస్తున్నారు. మెదక్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌కు మద్దతుగా ఆయన భార్య శివాణీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ మహిళా విభాగం సభ్యులతో వార్డుల్లో, గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి భార్య శైలజా రెడ్డి మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 4.40 లక్షల మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళా ఓటర్లు 2.27 లక్షల మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే.. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,13,089 మంది మహిళా ఓటర్లు ఉండగా, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,14,346 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఆయా మండలాలు, మున్సిపాలిటీల్లోని సెల్ఫ్ హెల్ప్? గ్రూప్‌లు, మెప్మా గ్రూపులలో మెంబర్లుగా ఉన్న మహిళల ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రూప్‌లలో ఉన్నమహిళలకు నెలకు రూ.3 వేల జీవన భృతి ఇస్తామని అధికార పార్టీ చెబుతుండగా, సౌభాగ్య లక్ష్మి స్కీం కింద నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. అలాగే గ్యాస్ సిలిండర్ ను రూ.500కే ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతుండగా, తాము రూ.400కే సిలిండర్ ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ చెబుతోంది. తమ పార్టీ అధికారంలోకి వస్తేచదువుకునే అమ్మాయిలకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఫ్రీగా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తోంది. ఎన్నికల ప్రచారంలో రెండు పార్టీలు ఈ విషయాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి.

# మానుకోట దమ్మేంటో చూపాలి

## సమైక్యవాదులను తరిమికొట్టిన గడ్డ ఇది

## తెలంగాణ వచ్చిన తరవాతనే అభివృద్ది

## మానుకోట ప్రచారంలో మంత్రి హరీష్ రావు



**మహబూబాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** ఓట్ల కోసం వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మానుకోట దమ్మేంటో చూపించాలని మంత్రి హరీశ్‌రావు ఆ నియోజకవర్గ ప్రజలను కోరారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శంకర్ నాయక్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీల మీటింగులు చూస్తే ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ మీటింగ్ అంటే జన సముద్రంలా ఉన్నాయన్నారు. సమైక్యవాదులు దండయాత్రకు వచ్చిన రోజు మానుకోట ప్రజలు తరిమికొట్టారు. మానుకోటకు మట్టికి, రాళ్లకు దండం అని పేర్కొన్నారు. ఆ దెబ్బతో సమైక్యవాదులు వెనుకకు పరుగెత్తారు. ఇప్పుడు కూడా అలాంటి చైతన్యం రావాలి. తెలంగాణ మీద దండెత్తడానికి వస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మానుకోట దమ్మేంటో చూపించాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి శంకర్ నాయక్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ూనుకోట రోడ్లు సిద్ధిపేట కంటే బాగున్నాయి. గులాబీ జెండా లేకుంటే మానుకోట జిల్లా అయ్యేదా? మెడికల్ కాలేజ్ వచ్చేదా? హార్టికల్చర్ కాలేజ్ వచ్చేదా? తండాలు గ్రామ పంచాయితీలు అయ్యేవా? పోడు భూములకు పట్టాలు వచ్చేవా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కర్ణాటకలో ప్రచారం చేసి 5 గ్యారంటీలు అని ఊదరగొట్టి మోసం చేశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి ఏ విషయం మీద పూర్తి అవగాహన ఉండదు.

# ఐటి దాడుల కలకలం

## రోహిత్ రెడ్డి నివాసంలో సోసాదాలు

**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతున్న వేళ ఐటీ అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో ఐటీ అధికారులు శనివారం సోదాలు నిర్వహిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులోని రోహిత్ రెడ్డి నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. ఆయన ఇంట్లో రూ.20 లక్షల నగదు, పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఎమ్మెల్యే అనుచరుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, హైదరాబాద్ పాతబస్తీలోని పలు వ్యాపారుల ఇళ్లల్లో సైతం ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కింగ్స్ ప్యాలెస్ యజమానుల ఇళ్లతో పాటు, కోహినూర్ గ్రూప్స్ ఎండీ మజీద్ ఖాన్ ఇళు ,, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. కోహినూర్, కింగ్స్ గ్రూపుల పేరుతో హోటళ్లలో ఫంక్షన్లు నిర్వహిస్తున్న ఈ వ్యాపారవేత్తలు ఓ రాజకీయ పార్టీకి భారీగా డబ్బు సమకూరుస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ తో పాటు శాస్త్రిపురంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. కాగా, ఇటీవల పొలిటికల్ లీడర్స్ టార్గెట్ గా ఐటీ, ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. తొలుత కాంగ్రెస్ నేతలు పారిజాత నర్సింహారెడ్డితొ మొదలైన దాడులు కేఎల్ఆర్, తర్వాత మంత్రి సబిత అనుచరులు, జానారెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి ఇళ్లల్లోనూ కొనసాగాయి. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ నేతలు గడ్డం వినోద్, వివేక్ ఇళ్లు కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ దాడులపై ఆయా పార్టీల నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ తమను ఇబ్బంది పెట్టేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# నిరంతర కరెంట్‌ను కర్నాటకలో అమలు చేయగలరా?

# అక్కడ సాధ్యం చేసి..ఇక్కడ మాట్లాడాలి

## నిరంతర విద్యుత్‌పై కాంగ్రెస్ విమర్శలు అర్థరహితం

## మండిపడ్డ మంత్రి జగదీశ్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** తెలంగాణ ఏర్పాడ్ద తరవాత కెసిఆర్ రాష్ట్రంలోని వినియోగదారు లందరికీ నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నది. తెలంగాణ ఏర్పడే నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 7,778 మెగావాట్లు కాగా, ప్రస్తుతం 18,453 మెగావాట్లుగా ఉంది. రాష్ట్రంలో ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ.12,727 కోట్లు కేటాయించి, 2022 ఆర్థిక సంవత్సరం నుంచి రూ.1,500 కోట్లకు పెంచింది. విద్యుత్ తలసరి వినియోగం 2014-15లో 1,356 యూనిట్లుగా ఉంది. 2021-22 నాటికి ఇది 2,126 యూనిట్లకు పెరిగింది. దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1,255 యూనిట్లుగా ఉంది. గత 9 సంవత్సరాలలో అన్ని వర్గాలకు రూ. 39,321 కోట్లతో సరఫరా పంపిణీ వ్యవస్థలకు బలోపేతం చేయడంతో 2014లో తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 1110 యూనిట్లు ఉంటే 2023 మార్చి 31 నాటికి 2126 యూనిట్లుకు చేరింది. దీనిని ఎవరూ కాదనలేని నిజం. దీనిని గుర్తించని కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌ను కర్నాటకలో అమలు చేసి చూపాలని సవాల్ చేశారు. జాతీయ తలసరి విద్యుత్ వినియోగం 73శాతం అధికంగా ఉంది. ఇది రాష్ట్ర ప్రగతికి నిదర్శనం. రాష్ట్రంలో 2.47శాతం అతి తక్కువ సరఫరా నష్టాలతో తర్వాత 99.98శాతం ట్రాన్స్‌మిషన్ అవైలబిలిటీతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఘనత సాధించింది. రైతులకు ఉచిత విద్యుత్ తో పాటు 101 యూనిట్ల వరకు ప్రతి నెలా 5,96,6 42 మంది ఎస్‌సి వినియోగదారులకు, 3,21,736 మంది ఎస్‌టి వినియోగదారులకు 2017 నుండి ఇప్పటి వరకు రూ. 656 కోట్ల విలువగల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడం జరిగింది. 29,365 నాయీ బ్రాహ్మణులకు సెలూన్‌లకు, 56,616 లాండ్రీ షాపులకు ప్రతి నెలా 250 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నది. 6667 పౌల్ట్రీ యూనిట్స్, 491 పవర్ లోమ్స్‌కు యూనిట్‌కి రెండు రూపాయల సబ్సిడీ ఇస్తుంది. 24 గంటల విద్యుత్తుపై తెలంగాణ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధి, నిబద్ధతకు ఇదే నిదర్శనం. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కరెంటు ఎప్పుడు వస్తదో పోతదో భగవంతుడికే ఎరుక. ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, జనరేటర్లు, స్టెబిలైజర్లు ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఐదారేండ్ల నుంచి 24 గంటల విద్యుత్తు అందుతున్న ఒకే ఒక్క రాష్ట తెలంగాణ. ఎన్నికల కోసం కాంగ్రెస్ నాయకులు 24 గంటల కరెంటు ఎందుకు రైతులకు 3 గంటలు సరిపోతుంది అన్ని ఇష్టం వచ్చినట్లుగా మాట్లడుతూ తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచే ధోరణిలో మాట్లాడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చెప్పే మాటలు నమ్మొద్దని, కర్ణాటక రాష్ట్రంలో 5 గంటల కరెంట్ ఇవ్వడానికే దిక్కులేదని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రైతు సంక్షేమం ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ దళిత బంధు అందజేస్తామని, ఎవరూ అపోహపడొద్దని సూచించారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 5 గంటల కరెంట్ ఇవ్వడానికే దిక్కులేదని, ఆ నాయకులు రాష్ట్రానికి వచ్చి ప్రగల్బాలు పలుకుతున్నారని, గంటలు కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. కర్ణాటక మోడల్‌ను నమ్ముకుంటే కటిక చీకట్లోకి బతకాల్సివస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నారని, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు తీసుకువస్తారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రభుత్వం పంచిన భూములను అమ్మే హకును కల్పిస్తదని, ప్రజలు ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కర్షక వ్యతిరేక విధానాలు

## అన్ని రాష్ట్రాల్లో ధర్నాలకు కిసాన్ సంయుక్త మోర్చా పిలుపు ■ విజయవాడలో ధర్నాకు సిఐటియు సన్నాహాలు

**విజయవాడ, నవంబర్ 25 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో మహా ధర్నా నిర్వహించాలని 500 రైతు సంఘాలకు నాయకత్వం ఇస్తున్న 'కిసాన్ సంయుక్త మోర్చా' మరియు అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నవంబర్ 27 ఉదయం 10 గంటల నుంచి 28 సాయంత్రం 6 గంటల వరకు నిరవధిక నిరసన ధర్నా జరుగుతుందని సిఐటియు నేత నర్సింగరావు చెప్పారు. భారతదేశ వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం 3 రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చింది. రైతాంగం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడి ఆ నల్ల చట్టాలను రద్దు చేయించారు. కాని మోడీ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించలేదు. వారిపై మోపిన 45 వేల అక్రమ కేసులు నేటికీ రద్దు చేయలేదు. రైతులకు గిట్టుబాటు ధర లేదు. బడ్జెట్‌లో ఉపాధి పథకం నిధులకు 25 శాతం కోత కోసి ఆ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తున్నదని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ కూలీల పని రోజులు పడిపోయాయి, ఆదాయం తగ్గిపోయింది. కౌలుదారులకు కనీస రుణాల చెల్లింపు అవకాశం లేదు. గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. బిజెపి నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదిన్నర సంవత్సరాలకుపైగా కార్మిక, కర్షక వ్యతిరేక?కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్నది. ఈ విధానాలను ఓడించాలని, మోడీని అధికారం నుంచి దించాలనే నినాదంతో మహా ధర్నా జరగబోతున్నది. గత రెండు నెలల నుంచి దేశవ్యాప్తంగా ఈ విధానాలపై ఉమ్మడి ప్రచారం సాగుతున్నది. గత ఏప్రిల్ 5వ తేదీన 'చలో ఢిల్లీ' సందర్భంగా కార్మిక కర్షక సంఘాలు ఐక్యతను ప్రదర్శించాయి. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు, సామాజిక అభివృద్ధికి రిజర్వేషన్లు కల్పించడం, అన్ని రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు పట్టుగొమ్మలుగా తోడ్పడ్డాయి. చంద్రయాన్-2 విజయంలో భారతదేశ పారిశ్రామిక స్వయం సమృద్ధి స్పష్టంగా తెలుస్తుంది. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని అమ్మేస్తాం లేదా మూసేస్తాం అనే తప్పుడు విధానాన్ని కేంద్ర బిజెపి చేపట్టింది. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షక ఐక్యతతో జరిగే పోరాటమే నేటి మహా ధర్నా. కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకున్న కొన్ని ముఖ్య నిర్ణయాలను పరిశీలిద్దాం. ఒక్క 2023 సంవత్సరంలోనే కార్పొరేట్ కంపెనీలు ఇంతవరకు ప్రభుత్వ బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు రూ.2.14 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. దీనితో కేంద్రం ఇప్పటి వరకు మొత్తం రూ.15.32 లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను రద్దు చేసింది. ఇదే కాలంలో సాంసంగ్, విస్ట్రాన్ మరియు అనేక ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ విదేశీ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాల పేరుతో రూ.1.97 లక్షల కోట్లను నేరుగా చెల్లించింది. ఈ డబ్బంతా సాధారణ ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్నవే. అదానీ, అంబానీలతో సహా ఈ రుణ మాఫీలో భాగస్వాములే. పేద ప్రజల పొట్టలు కొట్టి కార్పొరేట్లను మేపే విధానాన్ని మోడీ అనుసరిస్తున్నారు. కాకులను కొట్టి గద్దలకు వేయడమంటే ఇదేనని నర్సింగరావు మండిపడ్డారు. అన్ని ఖనిజాలను హారతి కర్పూరంలా బంగారు పళ్లెంలో పెట్టి మరీ బడా పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం అప్పగిస్తున్నది. దేశ సంపద ఎవరబ్బ సొమ్ము? బిజెపి 5 సంవత్సరాల పాటు అధికారంలో ఉండడమంటే దేశ సంపదకు బాధ్యత వహించాలి. ప్రజల సంపదను కాపాడాలి. అంతేగాని ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం దుర్మార్గం. భారత రైల్వేలో ప్రయాణం ప్రపంచంలోకెల్లా అతి చౌకయినది. ఇప్పటి వరకు 43 శాతం రైల్వే ప్రయాణీకులకు కేంద్ర ప్రభుత్వం ప్రయాణ ఖర్చులో రాయితీ ఇస్తున్నది. సరుకులను ప్రజలకు చౌకగా రవాణా చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రైళ్లను ప్రజా సంక్షేమం కోసం నడిపిస్తున్నది. కానీ నేడు వ్యాపారం కోసమే నడపాలనే లక్ష్యాన్ని నిర్ణయించింది. ప్యాసింజర్ రైళ్లను ఎత్తివేయడం, ఏసి కోచ్‌లను పెంచడం, 400 రైల్వే స్టేషన్లను, చుట్టూ ఉన్న స్థలాలతో సహా ప్రైవేటు వారికి అప్పగించడం రైల్వే ప్రైవేటీకరణలో భాగమే. దీనివలన ప్రజలకు రైల్వే సౌకర్యాలు తగ్గిపోతాయి. ప్రజలపై భారాలు పెరుగుతాయి. అలాగే విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలు కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. దేశమంతా 80 లక్షల కోట్ల విలువ కలిగిన విద్యుత్ పంపిణీని అదానీ, టాటా, జిందాల్ వంటి ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మన రాష్ట్రంలో ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను ఎత్తివేయబోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి పూర్తి చార్జీలు వసూలు చేస్తారు. ఇప్పటికే పాత బకాయిలు, ట్రూఅప్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డిపాజిట్ పేరుతో నెలకు ప్రతి యూనిట్‌కు అదనంగా 2 రూపాయలు పెంచుతున్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలలో భాగమేనని మండిపడ్డారు. .కార్మిక, కర్షక వర్గాలు కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధపడుతున్నాయని, ఈ ఆందోళనలకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని పిలుపునిచ్చారు.

# మోడీ, కెసిఆర్ ఇద్దరూ ఒక్కటే

## ప్రచార సభలో ఖర్గే ఆరోపణలు

**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** పీఎం మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్.. ఇద్దరూ అబద్ధాలే చెబుతున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేట డివిజన్‌లో నిర్వహించిన రోడ్?షోలో ఆయన మాట్లాడారు. 'బిడ్డ కోసమే కేసీఆర్ మోదీతో చేతులు కలిపిండని మండిపడ్డారు.. ఇద్దరూ ధనవంతులకే కొమ్ముకాస్తున్నరు. పేదలను మరింత పేదలుగా చేస్తున్నరు. పేదల ఖాతాల్లో మోదీ రూ.15 లక్షలు వేస్తామన్నారు.. వేశారా? రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని మోదీ చెప్పారు..

# బిఆర్ఎస్ ప్రోద్బలంతోనే ఐటి దాడులు

## మాజీ ఐఏఎస్ గోయల్ నివాసం నుంచి డబ్బులు పంపిణీ

## రైతుబంధు పంపిణీతో బిఆర్ఎస్, బిజెపి బంధం తేలింది

## ఇసిని జేబుసంస్థగా వాడుకుంటున్న బిజెపి

## మీడియా సమావేశంలో రేవంత్ విమర్శలు



**హైదరాబాద్, నవంబర్ 25 (సమ సమాజం):** మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయల్ ఇంటి నుంచి వెయ్యి కోట్ల రూపాయల పంపిణీ జరిగిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇంకా ఆయన నివాసంలో రూ.300 కోట్లు ఉన్నాయన్నారు. ఇవన్నీ వదిలి కాంగ్రెస్ నేతల ఇళ్లల్లో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేనని వీరిద్దరి ఒప్పందం మేరకు ఇప్పుడు రైతుబంధుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అన్నారు. కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫోన్ నుంచి సీఈఓ వికాస్ రాజ్‌కి వంద సార్లు కాల్ చేసినా ఎత్తలేద న్నారు. ఇద్దరం ఎంపీలం కలిసి వికాస్ రాజ్‌తో మాట్లాడడానికి ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదన్నారు. గోయల్ ఇంట్లో ఏం లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. వివేక్ కాంగ్రెస్‌లోకి రావడానికి సమన్వయం చేసిన వారిని ఈడీ ఇబ్బంది పెడుతోందన్నారు. మోదీ ప్రసంగాలకు, జరుగుతున్న తతంగాలకు పొంతన లేదన్నారు. వీర్లపల్లి శంకర్, బీర్ల అయిలయ్య లాంటి సామాన్యులకు మేం టికెట్ ఇచ్చామని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజాదర్బార్ పెడతాడో, జనతా బార్ పెడతాడో వాళ్ళకే తెలియాలన్నారు. వైన్ షాపులు, బెల్ట్ షాపులు పెట్టి ఉద్యోగాలు ఇచ్చామని చెప్తున్న ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని రేవంత్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మోదీ మధ్య ఫెవికాల్ బంధం మరోసారి బయట పడిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోదీ జేసీబీ, క్రేన్ పెట్టి లేపినా బీఆర్ఎస్ లేవదన్నారు. ప్రభుత్వ సొమ్ముతో ప్రజల ఓట్లు కో కేసీఆర్ భావిస్తున్నారన్నారు. పదేళ్ల పాటు సీఎం కేసీఆర్, ప్రధాని మోదీ పంచుకొని ఆస్తులు పంచుకున్నారన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకే బండి సంజయ్‌ని తొలగించి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేశారన్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఇంకా ఇందిరమ్మ ఇంట్లోనే ఉంటున్నాడని రేవంత్ విమర్శిస్తున్నాడన్నారు. కాంగ్రెస్‌కి పడే ఓట్లను చీల్చడానికి బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహం రచిస్తున్నాయని కేసీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ గెలిస్తే ఇదే చివరి రైతుబంధు అవుతుంది. కేసీఆర్ ఓటుకు పదివేలు పంచే ప్రయత్నం చేస్తున్నారు. రైతుబంధుకు అనుమతి తెచ్చుకున్న వాళ్ళు దళితబందు, బీసీ బందు, మైనారిటీ బందుకి అనుమతి ఎందుకు తెచ్చుకోలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో మా పోటీ ఈడీ, ఐటీ తోనే ఉంది. కాంగ్రెస్ నేతలపై ఈడీ దాడులు, గోయల్ ఇంటిపై దాడి, రైతుబంధు విషయంలో మోదీ, కేసీఆర్ స్నేహం స్పష్టంగా అర్థం అవుతోంది. జూన్ 2018 న రైతుబంధు మొదలైంది. 2018లో కేంద్రంతో ఒప్పందం చేసుకొని ఎన్నికలను ముందస్తుగా జరిపి రైతుబంధు వేశారు. పోలింగ్ కోసం లైన్‌లో నిలబడ్డ తర్వాత ఓటర్లకు డబ్బులు వేశారు. రైతుబంధు ద్వారా ప్రజలను ఆకర్షించారు అని స్పష్టంగా అర్థం అవుతోంది. డిసెంబర్ చివరి నుంచి మార్చి వరకూ వేయాల్సిన రైతు బందును కావాలని పోలింగ్ ముందు వేసేలా ప్లాన్ చేశారని రేవంత్ పేర్కొన్నారు. నవంబర్ 15 లోపే రైతుబంధు వేయాలని డిమాండ్ చేశాం. పోలింగ్‌కి నాలుగు రోజుల ముందు కేంద్రం, ఎన్నికల సంఘం కలిసి బీఆర్ఎస్‌కి హెల్ప్ చేసింది. మేం అధికారంలోకి వస్తే జనవరిలో 15 వేలు ఇస్తామని ప్రకటించాం. ఇప్పుడు బీఆర్ఎస్ 10 వేలు మాత్రమే ఇస్తోంది. బీఆర్ఎస్ రైతులందరికీ 5 వేల నష్టం చేస్తున్నారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జనవరిలో రైతులకు, రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానం నెరవేరుస్తాం. వివేక్ బీజేపీలో ఉన్నప్పుడు ఎలాంటి చర్యలు లేవు. బీజేపీలో ఉన్నప్పుడు రాముడిగా కనిపించిన వివేక్.. కాంగ్రెస్‌లోకి రాగానే రావణసూరుడిగా మారాడు. కేసీఆర్‌ని గద్దె దించేందుకు కంకణం కట్టుకున్నాడు కాబట్టే పొంగులేటిపై దాడులతో హింసిస్తున్నారు. పొంగులేటి బంధువు అయినందుకే రామసహాయం సుదర్శన్ రెడ్డి ఫ్యామిలీని ఇబ్బంది పెడుతున్నారని రేవంత్ తెలిపారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in